# అప్పులరావు ఐడియా

రచన:
శ్రీ ఎర్రోజు సత్యం.

అప్పులరావుకి యాభై రూపాయలు అవసరం పడ్డాయి. 'ఎవరినడగాలబ్బా' అంటూ ఆలోచనల్లో కొట్టుమిట్టాడుతున్నాడు అప్పులరావు సిగరెట్ పడుతూ.

అప్పులరావు ఆ ఊరిలోని చాలామంది దగ్గర అప్పులు చేశాడు. అప్పులు చేయడమే తన ధర్మమనుకునే అప్పులరావు చేసిన అప్పుల్ని తీర్చడం అధర్మమనుకుంటాడు. అందుకే అతణ్ణి ఎవ్వరు దగ్గరకు రానీయకపోవడమే పుణ్యమనుకుంటారు.

అదే పనిగా ఆలోచిస్తున్న అప్పులరావ్‌కి సర్పంచ్ సదాశివరావు స్ఫురించాడు. వెంటనే అతని గృహాన్ని పావనం చేశాడు.

"నమస్కారమండీ సర్పంచ్‌గారూ!" అంటూ గుమ్మందాటి లోనికొచ్చాడు అప్పులరావ్.

"నమస్తే! నమస్తే! ఏమిటీ విశేషం?" అన్నాడు సర్పంచ్. ఆ తర్వాత 'కూర్చో' అంటూ కుర్చీ చూపించాడు.

"మరేం లేదండీ సర్పంచ్, ఎలక్షను దగ్గరికొస్తున్నాయి గదా! ఎన్నెన్నో వింత గొలుపే విషయాల్ని వినవలసివస్తుంది." సర్పంచ్‌గారి ముఖ కవళికల్ని పరిశీలిస్తూ అన్నాడు.

"ఎవరెవరు నిల్చుంటారట" ఆతృతగా అడిగాడు సర్పంచ్.

"ఆ! ఇంకెవరు అక్షరం ముక్కరాని అడ్డగాడిదలందరూ - రోడ్లు పట్టుకొని తిరిగే జిడ్డు వెధవలందరూ పోటీ చేస్తారట. తమకు ఆపోజిట్ పార్టీవాళ్ళు సాకలి సాయిగాన్ని, రౌడీ రంగన్ని నిల్చోబెట్టి ప్రచారం చేస్తారట. ఇదయ్యా మన ఊరి పరిస్థితి" అన్నాడు ఏవగించుకుంటూ.

సర్పంచ్ కొద్దిగా ఆందోళన చెందాడు. పైకి కనబడనీయకుండా జాగ్రత్తపడి "ఇంతకు ఊళ్ళో ప్రజలేమంటున్నారు" గంభీరంగా ప్రశ్నించాడు.

"ఇంకేమంటారు ఊరి ప్రజలు. ఆపోజిట్ పార్టీ వాళ్ళు అనుకున్నంత దద్దమ్మలేంకాదు మన ప్రజలు. ఎంతో చాకచక్యం గలవాళ్ళు. ధర్మరాజులాంటి వారైన తమరున్నంత కాలం మరెవ్వరినీ రానివ్వమని భీష్మ ప్రతిజ్ఞ చేస్తున్నారు. ఎవరో కొద్దిమంది తమకు వ్యతిరేకంగా మాట్లాడినా అణచడానికి నేనూ నా మిత్రులు ఉన్నాం." అంటూ సిగరెట్ అడిగాడు. సర్‌పంచ్ ఎంతో ప్రేమతో అందించిన సిగరెట్టును వెలిగించుకొని ఒక్క దమ్ములాగి పొగ వదులుతూ.

"మీరేం ఫికరు పెట్టుకోకండి. గెలుపు మీది సంతోషం మాది" అన్నాడు అప్పులరావ్.

సర్‌పంచ్ ఆనందంతో పొంగిపోయాడు. ఒక్కసారి గర్వంగా మీసాల్ని దిద్దుకున్నాడు.

"మీరుండగా నాకేం ఫికరయ్యా నా ప్రజలెప్పుడు నాకు అన్యాయం చేయరని నాకు తెలుసు. సర్‌పంచ్ సంతోషంగా చెప్పాడు.

"అయినా మీరీ మధ్యన ఎవ్వరి మనసు నొప్పించకుండా ఎంతో జాగ్రత్తగా మసలుకోవాలి. ఎవ్వరూ ఏదడిగినా సాధ్యమైనంతవరకూ ఇస్తూ వారి ప్రేమను పొందుతూ ఉండాలి" హితువును చెప్పాడు అప్పారావ్.

మన్నికకు, అహ్లాదానికి...
పంజు టెక్స్ వారి
* మాస్టర్ * ఫాంటెక్స్
ఫైన్ బనియన్లనే వాడండి.
ఆంధ్రా మరియు, ఒరిస్సా ఏజెంట్లు :—
దుర్గా ఏజెన్సీస్, పి. బి. నెం. 84, విశాఖపట్నం-4.

"ఆ మాత్రం నాకు తెలియదటయ్యా ఎలక్షన్లు నెల పదిహేను రోజులే ఉన్నాయి. ఇప్పుడే కదా నా సహృదయాన్ని చాటుకునేది. ప్రజాసేవ చేసేది" సర్‌పంజ్ దృఢంగా చెప్పాడు.

"ఆ మాత్రం మీకు తెలియనిది కాదు. అయినా జ్ఞప్తిచేయడం మీ శ్రేయోభిలాషిగా నా కర్తవ్యం. అన్నట్టూ ఈరోజే నేను హైద్రాబాద్ వెళ్తున్నాను. ఒక యాభై రూపాయలు బదులివ్వండి. మళ్ళీ రాగానే మీవి మీకిచ్చేస్తాను. కరణంగారు అడిగిన తక్షణమే వంద రూపాయలిచ్చాడు" సమయస్ఫూర్తిగా అడిగాడు అప్పులరావ్.

సర్‌పంజ్ ఇరుకాటంలో పడ్డాడు. అప్పులరావ్‌కు ఇచ్చిన అప్పు తిరిగి రావడమనేది అసాధ్యమైన పని. కాదంటే ఎలక్షన్లు దగ్గరికొచ్చాయి. ఎటుపోయి ఏమౌతుందో అనుకున్నాడు. ఏమైనా ఇవ్వడమే మేలనుకున్నాడు.

"ఇదుగో అప్పులరావ్ మీలాంటి వారి అవసరాల్ని తీర్చడం నా ధర్మం." అని 'ఒక మాట నీవు హైద్రాబాద్‌నుండి వచ్చిన తర్వాత నన్ను మరిచిపోకుండా నావి నాకిచ్చి నా అవసరాల్ని తీర్చడం నీ ధర్మం' అన్నాడు మెత్తగా చెబుతూ.

"రామ! రామ!! ఎంతమాట మిమ్మల్ని మరిచిపోవడమా! రాబోయే ఎలక్షన్‌లో కాబోయే సర్‌పంజ్‌ని మరిచిపోవడం అసాధ్యమైన పని" అంటూ సర్‌పంజ్ అందించిన యాభై రూపాయిల్ని అందుకొని హడావిడిగా బయటపడ్డాడు అప్పులరావు.

★



సరోజిని ఆర్ట్స్ వారి
"చెప్పింది చేస్తా"
చిత్రంలో
కృష్ణ

★